సాక్షి శ్రీకాకుళం

బుధవారం ၊ 1 ၊ జనవరి ၊ 2025



దేహదారుఢ్య పరీక్షలు

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయి.

- IIలో



బియ్యం గింజపై వెల్‌కమ్..

కాశీబుగ్గ: కాశీబుగ్గ చెందిన సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ బియ్యం గింజంత ఆకారంలో వెల్‌కమ్ 2025 అంటూ బంగారు ఆకారం తయారు చేశారు. 0.30 మిల్లీ గ్రాముల బంగారాన్ని ఉపయోగించి అర సెంటీమీటరు వెడల్పులో ఆకృతిని తయారు చేశారు.

నూతన సంవత్సర వేడుకలకు దూరం



నరసన్నపేట: ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలకు తాను దూరంగా ఉంటున్నానని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప దినాలు ప్రకటించినందున వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. అభిమానులు, కార్యకర్తలు మబగాం రావద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే కార్యకర్తలు, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

'గత కేసులనూ పరిశీలిస్తాం..'



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బలగ మెట్టు డీసీసీబీ బ్యాంకు సమీపంలో నివసిస్తున్న దంపతులను కొంతమంది పత్రికా విలేకరులు బెదిరించిన ఘటన తన దృష్టికి వచ్చిందని ఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఇప్పటికే పోలీసులు కేసును నమోదు చేశారన్నారు. వారిపై ఇదివరకే కేసులున్నాయన్న విషయం తెలిసిందని, ఈ కేసుకు సంబంధించి సమగ్ర విచారణ తమ పోలీసులు జరుపుతున్నారన్నారు. కొద్దిరోజుల క్రితం బయటపడిన ఆర్మీకాలింగ్ రమణ అకృత్యాలకు సంబంధించి బాధితుల నుంచి కొత్త ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విచారణ చేస్తున్నామని, టెక్నికల్ ఎవిడెన్సులైన పెన్‌డ్రైవ్‌లు, ఇతరత్రా అన్ని ఆధారాలను పరిశీలిస్తున్నామన్నారు. నకిలీ నోట్ల కేసుకు సంబంధించి ఓ కేసులో రాజమండ్రికి చెందిన ప్రధాన నిందితుడిని ఇప్పటికే అక్కడి పోలీసులు అరెస్టు చేశారని అతని ద్వారా జిల్లాలో ఇంకెవరెవరున్నారన్న దానిపై ఆరా తీస్తామన్నారు.

నేరాలు తగ్గాయి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో రాత్రి పూట దొంగతనాలు పెరిగాయని, గంజాయి, ఎన్‌డీపీఎల్, సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు పెరిగాయని, మహిళలపై మానభంగ కేసులు పెరిగాయని, నేరాలు మొత్తంగా చూసుకుంటే 2023 ఏడాదితో పోల్చితే 2024లో అన్ని రకాల నేరాలు గణనీయంగా (17 శాతానికి) తగ్గాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వార్షిక గణాంకాలు వెల్లడించారు. 2023లో 11,017 కేసులు నమోదు కాగా 2024లో 9434 కేసులు నమోదయ్యాయన్నారు. మహిళలపై నేరాలు తగ్గాయని 462 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2023లో 282 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 2024లో 272 నమోదయ్యాయని 282 మంది మరణించారన్నారు. 2023లో 410 మిస్సింగ్ కేసులు నమోదు కాగా 2024లో 408 కేసులు నమోదయ్యాయన్నారు. నూతన సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 2025లో ప్రజలు నిర్దేశించుకున్న లక్ష్యాలు నెరవేరాలని ఆకాంక్షించారు.

పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి సంయుక్త సంచాలకులుగా రాజగోపాలరావు



బాధ్యతలు తీసుకుంటున్న రాజగోపాలరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి సంయుక్త సంచాలకులుగా డాక్టర్ కె.రాజగోపాలరావు మంగళవారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శాఖ వివిధ సంఘాల కార్య వర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



హోటల్ గ్రాండ్ కన్వెన్షన్‌లో హాస్య కళాకారుల ప్రదర్శన



డ్యాన్స్‌తో అదరగొట్టిన కళాకారులు



శ్రీకాకుళంలో రాధాకృష్ణ నగర్‌లో రంగవల్లిక

ఉత్సాహంగా.. స్వాగత గీతిక

నిశిరాత్రి పూట ఊరి దారుల్లో వెలుగులు నింపుతూ నూతన ఏడాది వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కూడళ్లలో జనం ఆనందంగా కేరింతలు కొడుతూ కొత్త సంవత్సరానికి వెల్‌కమ్ చెప్పారు. శ్రీకాకుళం జాతీయ రహదారి పక్కన, కేంద్రీయ విద్యాలయం సమీపంలోని గ్రాండ్ కన్వెన్షన్‌లో దుంపల వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.



జోష్ ఫుల్ : శ్రీకాకుళం 7రోడ్ల కూడలిలో యువత సందడి

కొత్త ఆశలు.. సరికొత్త ఆశయాలు



కాలం కొలిమిలో మరో ఏడాది కరిగిపోయింది.

కాలగమన చక్రంలో నూతన వత్సరం వచ్చేసింది. కొత్త ఆశలు, సరికొత్త ఆశయాలతో నూతన సంవత్సరానికి అంతా స్వాగతం పలుకుతున్నారు. గత కాలపు తప్పులను సమీక్షించుకుంటూ కొందరు.. రానున్న రోజులకు లక్ష్యాలను నిర్దేశించుకుంటూ మరికొందరు.. కొత్త ఏడాదికి వెల్‌కమ్ చెబుతున్నారు. జిల్లాలో 31 అర్ధరాత్రి హంగామా ఆకాశాన్నంటింది. కేక్‌లు కట్ చేసి వీధుల్లో చిందులేసి సంబరం చేసుకున్నారు. - సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

- కొత్త ఏడాదిపై కోటి ఆశలు
- నూతన ఆశయాలతో ముందుకు
- జిల్లా వ్యాప్తంగా న్యూఇయర్ జోష్
- ఘనంగా వేడుకలు

నూతన ఏడాది అనగానే ప్రతి ఒక్కరిలో కొత్త ఆలోచనలు, కొంగొత్త ఆకాంక్షలు మెదులుతాయి. ఇబ్బంది పెడుతున్న పాత అలవాట్లను వదిలించుకోవాలని భావించే వారు కొందరైతే.. కొత్త విధానాలను అవలంబించాలని నిర్ణయించుకునే వారు మరికొందరు. సాదాసీదాగా సాగిపోతున్న జీవితంలో నూతన సంవత్సరం నుంచి మరింత జోష్ నింపాలని అనుకుంటారు. తమకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం న్యూ ఇయర్ నుంచే ప్రారంభిస్తారు. ముందస్తు ప్రణాళికను రచించుకుని పకడ్బందీగా అమలు చేస్తూ గమ్యం వైపు సాగుతుంటారు.

ఇలా చేస్తే మేలు..

టార్గెట్ పెట్టుకుందాం..



చేసే వృత్తి, ఎంచుకున్న రంగం ఏదైనా ఉద్యోగి, విద్యార్థి, యజమాని, శ్రామికుడు, నాయకుడు, కార్యకర్త ఇలా ఎవరైనా ఒక టార్గెట్ పెట్టుకోవాలి. చేసే పనిలో మనమే ప్రథమంగా నిలవాలనే తపనతో ముందుకు సాగితే విజయం వీడకుండా అంటిపెట్టుకుని ఉంటుంది. అందుకు వర్తమాన అంశాలు, సమాజ స్థితిగతులు, మానవ జీవన విధానంలో చోటు చేసుకున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి.

ఆరోగ్యమే మహాభాగ్యం..



ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు ఎందుకు అన్నారో కోవిడ్ తర్వాత అందరికీ బాగా అర్థమైంది. అందుకే అంతా ఆరోగ్యకర జీవన శైలి అలవాటు చేసుకుంటున్నారు. ఉదయం నడక, వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి అలవాటు చేసుకోవడం అనివార్యం. సమయానికి తిండి, నిద్రకు ప్రాధాన్యం తెలుసుకుంటే ఉదయం వేళ హుషారు, మానసిక ఉత్తేజం తప్పకుండా లభిస్తుంది.

ధైర్యంగా బతుకుదాం..



గత ఏడాది యువత బలవన్మరణాలు అందరినీ కలిచివేశాయి. ఈ ఏడాదైనా మనసుకు మనం ధైర్యం చెప్పుకుందాం. మనిషి ప్రాణం విలువైనది. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఉండాలి. ఒక్క క్షణం ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం దొరకవచ్చు.

ప్రయాణాల్లో జాగ్రత్త సుమా..



గత ఏడాది లెక్కకు మిక్కిలి రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కాసింత జాగ్రత్తగా ఉంటే వీటిలో చాలావరకు ప్రాణాపాయం తప్పేవే. ఈ ఏడాదైనా ఆ తప్పులను సరిచేసుకోవాలి. అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ప్రతిజ్ఞ చేసుకోవాలి. నిత్యం జరుగుతున్న ఘటనలు మనకు ప్రయాణ పాఠాలుగా తీసుకోవాలి. జాగ్రత్తగా వ్యవహరిస్తూ గమ్యం చేరాలి.



బాని'సెల్' కావద్దు..

సెల్‌ఫోన్ వచ్చాక మానవ సంబంధాలు తగ్గిపోయాయి. సెల్‌ఫోన్ ఇప్పుడు మనిషినే శాసించే స్థాయికి వెళ్లిపోయింది. బానిస కాకుండా జాగ్రత్త పడాలి. స్మార్ట్‌ఫోన్‌కు బానిస కాకుండా బాధ్యతగా వినియోగించాలి. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో అప్రత్తమత్తంగా వ్యవహరించాలి. వివాదాలకు, పుకార్లకు దూరంగా ఉండాలి. చిన్నారులు, యువత సెల్‌ఫోన్‌లో గేమ్‌లకు వ్యసనపరులు కాకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది.

బద్ధకం వదిలేద్దాం..



పనా.. ఇప్పుడు కాదు తర్వాత చేద్దాం.. అన్న ఆలోచనకు పాత ఏడాదిలోనే సమాధి కట్టేయాలి. కష్టమవుతుంది.. అంత పనిచేయలేను అనే మాటలు పక్కన పెట్టి అనుకుంటే సాధించలేనిది ఉండదు. ఎంతటి పనైనా చేసేద్దామనే సంకల్పం ఉండాలి. చరిత్రను చూస్తే ఎన్నో విజయ గాథలు ఉన్నాయి.

ఆధ్యాత్మికంగా ముందుకు సాగుదాం



నూతన సంవత్సరానికి ఆధ్యాత్మికంగా స్వాగతం పలుకుదాం. సమాజం అభివృద్ధి చెందాలంటే ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరిలో పెంపొందాలి. 2024 సంవత్సరం అంతా చాలా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. 2025 అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను. - అంపోలు రామాచార్యులు వేదపండితులు, ఆమదాలవలస

విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తా



విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా నా వంతు కృషి చేస్తున్నాను. 2024 సంవత్సరంలో జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డులు నన్ను వరించాయి. 2025 సంవత్సరంలో మరింత మెరుగ్గా సేవలు అందించి విద్యాభివృద్ధికి కృషిచేస్తాను. - టీవీ రమణమ్మ, ప్రధానోపాధ్యాయురాలు, మున్సిపల్ హైస్కూల్ ఆమదాలవలస గేటు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత

మంచి జరగాలి



ఈ ఏడాది అందరికీ సుఖసంతోషాలు కలగాలి. ఈ ఏడాది నేను,మా గ్రూపు సభ్యులు చేస్తున్న మంచి కార్యక్రమాలు ఇంకా పెరగాలని కోరుకుంటున్నాం. అందుకు తగ్గ బలం మాకు లభించాలి. అందరి సహకారం కావాలి. - పిండి శారద, గృహిణి, పద్మావతి నగర్ కాలని, శ్రీకాకుళం

ఏదీ.. ఇంటి వద్దకే పింఛన్..!

గార: ఇంటి వద్దకే పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నా మండలంలోని పలు గ్రామాల్లో అమలుకావడం లేదు. మంగళవారం ఉదయం అంపోలు పంచాయతీ ఆడవరం గ్రామంలో బరాటం సరస్వతి దుకాణం వద్దకు అందరినీ పిలిచి పెన్షన్ ఇచ్చారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్యామల వద్ద ప్రస్తావించగా ఇంటి వద్దకు వెళ్లి ఇవ్వాలని చెప్పడం జరిగిందని, ఇకపై అలా జరగకుండా చర్యలు చేపడతామన్నారు.



ఆడవరంలో ఒకే చోట పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఉజ్బెకిస్తాన్‌లో జిల్లా యువకుల అవస్థలు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన కొందరు యువకులు పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం ఉజ్బెకిస్తాన్ దేశం వెళ్లి అక్కడ అగచాట్లు పడుతున్నారు. మూడు నెలలుగా సరైన భోజనం లేక, చేతిలో చిల్లిగవ్వ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ సోషల్ మీడియాలో సందేశాన్ని పంపించారు. బాధితులు చింత హేమారావు, ఎన్.శ్రీను, గర్తం జోగారావు, శంకరరావు, జీవన్, ఆర్.మహేష్, షణ్ముఖరావుతో పాటు మరికొంత మంది విదేశంలో చిక్కుకొని ఆకలి కేకలతో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను భావనపాడుకు చెందిన ఏజెంట్ విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఉజ్బెకిస్తాన్ పంపించారని, ఇక్కడకు చేరుకున్న తమను లాడ్జిలో పెట్టి ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో పాటు ఎలాంటి సమాధానం లేక, సరైన తిండి పెట్టకపోవడంతో మోసపోయామని గ్రహించామని తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కూడా మాట్లాడామని, తమను కాపాడి స్వదేశానికి తీసుకురావాలని కోరారు.



విదేశంలో చిక్కుకున్న బాధితులు

మట్టి కుండలో వంట.. ఇదే ఫ్యాషనంట



న్యూ ఇయర్ వేడుకల్లో మట్టి కుంపట్లు కనిపించాయి. నగరంలోని ఓ హోటల్‌లో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మట్టి కుంపటిపై కుండల్లోనే వండి వార్చడం అందరి దృష్టిని ఆకర్షించింది. కుంపటి సెగపై మట్టి కుండలో వంట వేడుకలకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. - శ్రీకాకుళం

పోలీస్‌స్టేషన్‌లో

నిందితుడు పరారీ?

ఎచ్చెర్ల క్యాంపస్: పలు దొంగతనాల్లో ప్రమేయం ఉన్నట్లు భావిస్తూ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్న నిందితుడు పరారైనట్లు తెలిసింది. మంగళవారం ఉదయం 7.30 గంటల సమీపంలో పోలీసుల కళ్లుగప్పి పారిపోయినట్లు సమాచారం. జిల్లాలో పలు ఇళ్లల్లో జరిగిన నేరాలకు ఈ వ్యక్తికి సంబంధం ఉన్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాంబాబుగా పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాళం వేసి ఉన్న ఇళ్లల్లో బంగారం, డబ్బు చోరీ చేస్తుంటాడు. ఇతన్ని మూడు రోజులుగా పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. విచారణలో ఉండగా, పోలీస్ స్టేషన్ నుంచి పారిపోవడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. చాకచక్యంగా దొంగతనాలు చేయటం, బంగారం తాకట్టు పెట్టి మరో ప్రాంతానికి పారిపోవటం ఈ దొంగ ప్రత్యేకత. ప్రస్తుతం నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో కానిస్టేబుల్ ఎంపికలో భాగంగా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 30 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు సెలవు దినాల్లో మినహా పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అధికారులు ఎంపికలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, మంగళవారం 605 మంది అభ్యర్థులకు గాను 409 మంది హాజరయ్యారు. వీరిలో 205 మంది అర్హత సాధించారు.


అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

రైతుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో ధాన్యం అమ్మేందుకు వెళ్తున్న రైతులు మిల్లర్ల నుంచి వేధింపులకు గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు బీన ఢిల్లీ రావు కోరారు. ఈ మేరకు మంగళవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. పలాస డివిజన్ పరిధిలో 10 కిలోల ధాన్యం ఎక్కువగా తూకం వేస్తున్నారని, ఇదేంటని రైతులు ప్రశ్నిస్తే ధాన్యం పట్టుకెళ్లిపోండని మిల్లర్లు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చౌదరి లక్ష్మణరావు, అమిరుల్లా బేగ్ పాల్గొన్నారు.


జేసీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జిల్లాకు ఏం చేశారో చెప్పాలి?

- టీడీపీ పాలనంతా అవినీతిమయం
- వైఎస్ జగన్ హయాంలో అభివృద్ధి
- అచ్చెన్నపై పేరాడ తిలక్ ధ్వజం

టెక్కలి : బహిరంగ సభల్లో మంత్రి అచ్చెన్నాయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని, టీడీపీ పాలనలో ఈ జిల్లాతో పాటు టెక్కలి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేశారో బహిరంగంగా చెప్పాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. మంగళవారం టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, రూ.800 కోట్లతో సుజలధార ప్రాజెక్టు, గొట్టా బ్యారేజీ వద్ద రూ.176.35 కోట్లతో ఎత్తిపోతల పథకం, రూ.4 వేల కోట్లతో మూలపేట పోర్టును ఈ జిల్లాకు అంకితం చేసిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. మా హయాంలో చేసిన అభివృద్ధిని ధైర్యంగా ఆధారాలతో చెప్పగలుగుతున్నామని, టీడీపీ పాలనలో అభివృద్ధి చేశామని ప్రగల్భాలు పలుకుతున్న అచ్చెన్నాయుడుకు గత వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధి కనిపించకపోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పీకల్లోతు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతూ కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా నిలదీసిన సామాన్యులపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సొంత సామాజిక వర్గానికి చెందిన పోలీసులు, రెవెన్యూ అధికారులతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. కూటమి ఆరు నెలల పాలనలో ఎంత మంది ఉద్యోగులను తొలగించారు, ఎంత మంది దళిత, సామాన్య వర్గాలపై దాడులు చేశారో అందరికీ తెలుసన్నారు. అమరావతి ప్రాంతంలో చంద్రబాబు చేసిన భూకుంభకోణాలకు అమ్ముడుపోవడంతో అచ్చెన్నాయుడుకు, రామ్మోహన్‌నాయుడుకు రాష్ట్ర, కేంద్రమంత్రి పదవులు వరించాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా విమర్శలు మానుకుని ఎన్నికల హామీలు, అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, టెక్కలి మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్ : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథ్, ఆర్టీసీ ఒకటో డిపో కార్యదర్శి ఎస్.వి.రమణడిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండవరోజైన మంగళవారం కూడా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఈయూ జోనల్ కమిటీ ఆదేశాల మేరకు 2019 జనవరి 1 సర్క్యులర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని, ఇటీవల సస్పెండ్ చేస్తూ వివిధ డిపోలకు ఇచ్చిన వారిని తిరిగి వెనక్కి రప్పించాలని, రన్నింగ్‌టైం సరిపోని రూట్‌లలో సర్వేలు జరిపి కచ్చితమైన రన్నింగ్ టైంలతో షెడ్యూల్ అమలు చేయాలని, వర్క్‌షాపులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, డ్రైవర్, కండక్టర్ డ్యూటీ చార్టులు అవసరమైన డిపోలలో తక్షణమే వేయాలని, ప్రతి డిపోలో రెస్ట్‌రూం సౌకర్యాలు కల్పించాలని, కొందరు అధికారులు, సూపర్‌వైజర్లు చేస్తున్న ఏకపక్షనిర్ణయాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు కె.బాబూరావు, కె.గోవిందరావు, బి.ఆనంద్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో మంగళవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆవిష్కరించారు. మాజీ సైనికులకు, వీర నారీమణులకు, వీర మాతలకు, సైనిక వితంతువులకు, వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్ష తెలిపారు. మాజీ సైనికులు చేస్తున్న సేవలు ప్రస్ఫుటించేలా క్యాలెండర్‌ను తయారు చేసినట్లు జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కటకం పూర్ణ చంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా ఎక్స్‌సర్వీస్ మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ వెటరన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, హానరరీ ప్రెసిడెంట్ ఎస్.ఎల్.రంగారావు, కోశాధికారి డి.సింహాచలం, లీగల్ అడ్వైజర్ ఎ.వి.జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌కు వడ్డాది పాపయ్య పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లికి చెందిన చిత్రకారుడు రాహుల్ పట్నాయిక్ వడ్డాది పాపయ్య స్మారక పురస్కారం అందుకున్నారు. విశాఖకు చెందిన చిత్రకళాపరిషత్ ఆధ్వర్యంలోకంచరపాలెం బీఎస్‌ఆర్ భవనంలో ఆదివారం ఈ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఒకే చట్రంలో వడ్డాది పాపయ్య గీసిన వంద చిత్రాలను సూక్ష్మీకరించి అందంగా తీర్చిదిద్దారు.

ఈ నేపథ్యంలో వపా వర్ధంతిని పురస్కరించుకొని ఆయన లోగోతో ఉన్న రజత ఉంగరాన్ని నిర్వాహకులు బహూకరించారు. కార్యక్రమంలో చిత్రకళాపరిషత్ కార్యదర్శి సుంకరి చలపతిరావు, బీఎస్‌ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి బి.ఆర్.జి.రాజు తదితరులు పాల్గొన్నారు.


వపా స్మారక పురస్కారంతో రాహుల్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో ఢిల్లేశ్వరి ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయాతీనగరంలో ఎంజేపీఏపీబీసీఆర్‌డబ్ల్యూ బాలికల పాఠశాలకు చెందిన వండాన ఢిల్లేశ్వరి ప్రతిభ కనబర్చింది. విజయవాడలో భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌశల్–2024 పోస్టర్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిచి పాఠశాల విద్య ఉన్నతాధికారులు, నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతి అందుకుంది. విద్యార్థినితో పాటు శిక్షణ ఇచ్చిన ఫిజిక్స్ టీచర్ చంద్రశేఖరుని కవిత, టీచర్లను, సిబ్బందిని ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి మంగళవారం అభినందించారు.


బహుమతి అందుకుంటున్న వండాన ఢిల్లేశ్వరి

ముద్దాయికి జైలు శిక్ష

టెక్కలి రూరల్: మండలంలోని రాధావల్లభపురం గ్రామానికి చెందిన లండ లక్ష్మి అనే దళిత మహిళను అదే గ్రామానికి చెందిన సనపల ఢిల్లేశ్వరరావు కులం పేరుతో దూషించడంతో బాధితురాలు 2015లో టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్‌ఐ పి.నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీసెల్ డీఎస్పీ సీహెచ్ పెంటారావు దర్యాప్తు నిర్వహించారు. నేరం రుజువు కావడంతో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎస్‌ఎం ఫణికుమార్ ముద్దాయికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.11వేలు జరిమానా విధించారు.

విద్యార్థులకు కథల పోటీలు

టెక్కలి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'చిక్కోలు చిన్నోళ్లు' పేరిట కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు, అకడమిక్ విభాగం కన్వీనర్ పి.ధర్మారావు తెలిపారు. జనవరి 26లోగా 9493044470 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు

శ్రీకాకుళం క్రైమ్ : నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా బుధవారం రాత్రి 12 గంటల వరకు జిల్లా కేంద్రంలో మద్యం దుకాణాలు తెరిచే ఉంటాయని, బార్ అండ్ రెస్టారెంట్లు ఒంటిగంట వరకు ఉంటాయని ఎక్సైజ్ సీఐ ఎం.వి. గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

క్లుప్తంగా

ఇద్దరు యువకులకు రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్ సమీపంలో బహిరంగంగా మద్యం తాగి అలజడి సృష్టించిన యువకులకు 20 రోజుల పాటు కోర్టు రిమాండ్ విధించిందని ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. సల్మాన్‌ఖాన్, కుందు ఎర్రయ్య అనే యువకులు మద్యం మత్తులో ఓ వృద్ధురాలిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి అలజడి సృష్టించి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే ఇలానే కేసులు నమోదు చేసి జైలుకు పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

దోపిడీ దొంగలు అరెస్టు

సారవకోట: మండలంలోని నౌతళ ఘాట్ రోడ్డులో డిసెంబర్ 26న జరిగిన దోపిడీ ఘటనను సారవకోట పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు మంగళవారం వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 26న అంగూరు పంచాయతీ అడ్డపనస గ్రామానికి చెందిన కరగాన రాజు తన బొలేరో వాహనంలో పాతపట్నం వైపు నుంచి సారవకోట వైపు వస్తుండగా రాత్రి 10.30 గంటల సమయంలో నౌతళ ఘాట్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు వాహనాన్ని ఆపారు. దాడి చేసి అతని వద్ద రూ.66 వేలు, మొబైల్ ఫోన్ దోచుకుని పరారయ్యారు. బాధితులు సోమవారం సారవకోట పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం నరసన్నపేట మండలం టెక్కలిపాడు జంక్షన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశా రాష్ట్రం బడోకుసిమికి చెందిన కేశభాగొడ్, చంద్రపూర్ గ్రామానికి చెందిన హృషికేశ్ స్వరగూల్ అలియాస్ పుష్పను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా తామే దోపిడీ చేసినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ.63 వేలు నగదు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

28 ధాన్యం బస్తాలు చోరీ

బూర్జ: మండలంలో తోటవాడలో గేదెల జోగినాయుడుకి చెందిన 28 బస్తాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధిత రైతులు బూర్జ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొమ్మువలస, నరేంద్రపురం గ్రామాల సమీపంలో వ్యవసాయ భూమిలో ఆదివారం నూర్పు చేసి 53 బస్తాలను నిల్వ చేసి ఉంచారు. మంగళవారం లోడ్ చేయడానికి వ్యాను తీసుకెళ్లగా 28 బస్తాలు కనిపించలేదు. ఈ మేరకు బాధిత రైతుల పోలీసులను ఆశ్రయించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

- టైలరింగ్ వర్క్ షాప్ ఫ్రాంచేంజ్‌గా ఇన్వెస్ట్‌మెంట్ చేసేవారు కావలెను. నెలనెల పనికి తగ్గ ఆదాయం కల్పును. ఫోన్ : 90007 92363, 70936 32399 [V-823984]
- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

WANTED

- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99434]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.